స్కూలుకు తయారై బయలుదేరబోతున్న సమయంలో నా స్నేహితులు జాన్, రహంతుల్లా మా ఇంటికి పరుగెత్తుకొచ్చారు. వారందించిన వార్త విని నేను ఖిన్నుడనయ్యాను! మా క్లాస్‌మేట్ భార్గవి తండ్రి రాత్రి గుండెపోటు వచ్చి చనిపోయాడు.

శర్మగారిది చాలా పేద కుటుంబం. ఆయనకు భార్గవి ఒక్కతే సంతానం. ఆయన నాయుడుగారి రైస్ మిల్లులో గుమాస్తాగా పని చేస్తూ ఆ వచ్చే జీతంతో కుటుంబాన్ని పోషిస్తున్నారు.

నేను పుస్తకాలు అక్కడ పడేసి శర్మగారింటికి పరుగుతీశాను. జాన్, రహంతుల్లా నన్ననుసరించారు.

వీధి వాకిట అరుగుమీద శర్మగారి భౌతికకాయాన్ని పరుండబెట్టి వుంచారు. తల వైపు దీపం వెలుగుతోంది. శర్మగారి భార్య, భార్గవి గుండెలవిసేలా రోదిస్తున్నారు. కొంత మంది ఆడవాళ్ళు వాళ్ళిద్దర్నీ ఓదార్చడానికి ప్రయత్నం చేస్తున్నారు. వూరిలోని మగవారు గుంపులు గుంపులుగా చేరి చూస్తూ నిల్చున్నారు.

నేను అక్కడి పరిస్థితులు చూచి చలించి పోయాను. ఇక ఆ కుటుంబానికి దిక్కెవ్వరు? భగవంతుడి లాంటి దురదృష్టకర పరిస్థితుల నెందుకు ఏర్పరుస్తాడో? మనుష్యులను దీనులను చేసి ఏడిపించడం ఆయనకు సరదా కావచ్చు.

మా స్నేహితత్రయం స్కూలు మానేసి భార్గవిని ఓదారుస్తూ కూర్చున్నాము. మధ్యాహ్నం మూడు గంటల వేళ భార్గవి వాళ్ళ ఇంటి ఓనర్ వీరభద్రరావు వచ్చాడు.

"శవాన్ని తరలించే ఏర్పాట్లు చూడండి. మళ్ళీ ప్రొద్దుపోతే అంత్యక్రియలకు కష్టమౌతుంది" అన్నాడు.

అంత్యక్రియలు మాట వింటూనే అక్కడ గుమిగూడిన వారంతా ఒక్కొక్కరే జారుకొన సాగారు. ఈ మనుష్యుల ప్రవర్తన నాకు వింతగా తోచింది. ఎవరు పట్టించుకొనకపోతే జరగవలసిన తతంగం జరిగేదెలా? ఎవ్వరూ పట్టించుకొనక పోయినా, నా స్నేహితుల సాయంతో అంత్యక్రియలు నేనే జరిపించాలనుకున్నాను.

"అమ్మా! మీ తరపున రావలసిన వాళ్ళెవరైనా వున్నారా?" అడిగాను శర్మగారి భార్యను.

"ఎవ్వరూ వచ్చేవాళ్ళులేరు." నిర్వికారంగా అందావిడ.

"కార్యక్రమం ఎలా ప్రారంభించాలి?" నాకేమీ తెలియదు గనుక ఆమెనే అడిగాను.

"ఆయన ఒకప్పుడు బాగా బ్రతికిన వాడు. అంత్యక్రియలు శాస్త్రోక్తంగా జరిపించండి బాబు" కళ్ళు తుడుచుకుంటూ అందామె.

"అందుకే, కార్యక్రమం ఎలా మొదలెట్టాలో చెప్పండి" అన్నాను నేను.

"ముందువెళ్ళి శాస్త్రిగారిని కలవండి. ఆయన కావలసిన వస్తువుల జాబితా ఇస్తాడు. ఆయన చెప్పిన ప్రకారం చెయ్యండి." శర్మగారి భార్య సూచించింది.

మేము ముగ్గురం శాస్త్రిగారింటికి వెళ్ళాము. వాకిట అరుగుమీద కృష్ణాజినం మీద కూర్చుని ఏదో పురాణ గ్రంథం చదువుకుంటున్నాడాయన.

"నమస్కారం స్వామి" ముగ్గురం ఏక కంఠంతో పలికాము.

"ఏమిటోయ్ పిల్లకుంకలు పరుగెత్తుకొచ్చారు." కళ్ళద్దాల నుండి మమ్ములను చూస్తూ అడిగాడాయన

"శర్మగారు వెళ్ళిపోయారు. అంత్యక్రియలు జరిపించడానికి మిమ్మల్ని పిలవ మన్నారు. కావలసిన వస్తువుల జాబితా వ్రాసిస్తే, వెళ్ళి తీసుకొస్తాము." అన్నాను నేను.

"పిల్లకాకులులా మీరేంటి పెత్తనం వహించేది? అతనికి మగపిల్లలు లేరుగా ముందు తలకొరివి పెట్టే మనిషిని వెతుక్కురండి. అలాగే శవాన్ని శ్మశానానికి మోసుకెళ్ళేందుకు మోతగాళ్ళను చూడండి."

"అవన్నీ మాకేం తెలుసు స్వామి. మీరే ఆ ఏర్పాట్లు చూడకూడదూ?"

"పట్నం వెళ్ళి సత్రం దగ్గర విచారిస్తే వస్తారు."

"అందుకుగాను కూలి మనుష్యు లుంటారా స్వామి?"

"వున్నారయ్యా! అయినా ఎవరన్నా పెద్దవాళ్ళు రాక, మీరు పూనుకున్నారేంటి. ఇదంతా చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం. మోతగాళ్ళకు కూలి రెండువందల యాభై రూపాయలు. తల కొరివి పెట్టే కూలి మనిషికి వంద రూపాయలు. అలాగే ఏడుగుండ్ల కట్టెలు కావాలి. ఇందుకు ఓ నూటపాతిక రూపాయ లౌతాయి. ఇకపోతే ఈ రోజు దహనం చేయించి, రేపు సంచయనం చేయించడానికి నా బృహస్పతి దానం అయిదు వందలు. పాడి కట్టెలు– కుండలు, నువ్వులు వగైరా కొక యాభై రూపాయలు. సుమారు వెయ్యి రూపాయలుంటేనే కార్యక్రమం మొదలుపెట్టను వీలౌతుంది."

"శర్మగారి దీన పరిస్థితిని దృష్టిలో వుంచుకుని కాస్త ఉదారంగా వ్యవహరించండి." ప్రాధేయపడ్డాను నేను.

"ఇందులో ఉదారం ఏదీ లేదు. సుస్తీ చేసిందని డాక్టర్ వద్ద కెడితే "అయ్యో పాపం!" అని మందిచ్చి పంపిస్తున్నాడా? రోగాన్ని గురించి భయంకరంగా చెప్పి వీలైన వరకు డబ్బు గుంజడం లేదూ? ఏదైనా అంతేరా కుర్రకుంకా! కావలసిన వస్తువులు వ్రాసిస్తాను. వెళ్ళి పట్టుకురండి" అని తెల్ల కాగితం మీద కావలసిన వస్తువుల జాబితా వ్రాసిచ్చాడు.

"శాస్త్రిగారు! వాళ్ళు ఏమీ లేనీ పేద వారు. మీసాటి కులస్తులు. మీరు సాయం చెయ్యలేరా?" అడిగాను నేను.

తల అడ్డం తిప్పాడాయన.

"మీ మంత్రం లేకుండా దహనం చేస్తే ఏమౌతుంది?" నాలో అంతకంతకు ఉక్రోషం పెరుగుతూంది.

"చనిపోయిన ఆ వ్యక్తికి సద్గతులు దక్కవు."

"అంటే మీ మంత్రాలలో అంతటి ప్రభావముందా?"

"వేదమంత్రాలతో కూడినది వైదీకం. మీకేత చెప్పినా అర్థంకావు. వెళ్ళండి" అని లేచి ఇంట్లోకి వెళ్ళిపోయాడాయన.

ఇతను కాకపోతే మరొకడు అనుకొని, జాన్, రహంతుల్లాలను జాబితాలోని వస్తువులు తీసుకురమ్మని పురమాయించి, నేను సైకిలెక్కి ప్రక్క గ్రామం వెళ్ళి అక్కడి పురోహితుణ్ని కలిసాను.

"మీ గ్రామం శాస్త్రిగారు లేరా?" అడిగాడాయన.

"వున్నారుకానీ... ఆయన రేటు ఎక్కువ చెప్తున్నారు."

"అలాగా! అయినా ఆయన పరిధిలోని గ్రామానికి, ఆయన అనుమతి లేకుండా మేము వచ్చి చేయకూడదు. ఇది మా వృత్తి నిబంధన. వెళ్ళి ఎలాగోలా ఆయనకు నచ్చచెప్పు." అని ముక్కుసూటిగా నిరాకరించాడాయన.

"పురజనుల హితవుకోరే వారిని పురోహితులనాలిగానీ, ఇలాంటి పరాన్నభుక్కులను కాదు!" అనుకుంటూ సైకిలెక్కి మా వూరి దారిపట్టాను.

గ్రామం చేరేసరికి రహంతుల్లా, జాన్ నాకోసం ఎదురు చూస్తున్నారు. గ్రామంలోని ఇళ్ళన్నీ తిరిగి చందాలు వసూలు చేసాము. సుమారు అయిదువందలు వసూలైంది. శాస్త్రోక్తంగా అంత్యక్రియలు జరిపించడానికి ఈ మొత్తం

చాలదు.

"అమ్మా! మీరు కోరిన రీతి అంత్యక్రియలు జరిపించడం స్వార్థం పెరిగిన ప్రస్తుత సమాజంలో జరిగే పనిలాలేదు. పేదరికం ఒక మహా శాపమనుకుంటే, దానికి ప్రత్యామ్నాయం మన శాస్త్రాలను మార్చివేయడం, లేదా ఏమార్చివేయడమే. మనం జరిపే శాస్త్రోక్తమైన అంత్యక్రియలు ద్వారా ఆయన ఆత్మకు సద్గతులు కలుగుతాయనుకోవడంకన్నా, అతనీ ప్రపంచంలో బ్రతికి వున్నప్పుడు చేసిన పుణ్యకార్యాలు అతని ఆత్మకు మేలు చేస్తాయని నమ్మడం మేలు. మేము పేదవారం. అందుకే మాకు చేతనైన రీతి ఈ దివంగతునికి అంత్యక్రియలు జరిపిస్తాము." అని ఆమె అనుమతి తీసుకున్నాను.

రహంతుల్లా వెళ్ళి వాళ్ళ రెండెడ్లబండిని తెచ్చాడు. పాడెకట్టి, ఆ శవాన్ని బండిమీద వుంచాము. కొరివిపట్టడానికి అవసరమైన నిప్పును నేనే చేతపట్టుకున్నాను.

"బాబు! నీవు తల్లీ- దండ్రీ వున్న వాడివి. నీవు కొరివి పెట్టకూడదు." అంతటి శోకంలోను నన్ను వారించింది శర్మగారి భార్య.

"పర్వాలేదు. ఇదొక పుణ్యకార్యంగా భావిస్తున్నాను. నాకే కీడు జరగదు." అని నేనంటూండగానే, నా చేతిలోని "నిప్పు ఉట్టిని" మరొక చేయి అందుకుంది.

"మాస్టారు మీరా?" ఆశ్చర్యంగా అడిగాను.

మా తెలుగుమాస్టారు నరసింహంగారు నాకేసి ప్రసన్నంగాచూస్తున్నారు.

"అమ్మా! మీ భర్త అంత్యక్రియల కొచ్చిన దిగులులేదు. ఆ మంత్రాలు, వాటి అర్థాలు నాకూ తెలుసు. నాకు తల్లీ దండ్రిలేరు. ఆయన తలకొరివి నేను పెడతాను" అని బండి వైపు సాగాడాయన.

మా క్లాసు పిల్లలంతా బండి వెనుక బారులు తీరి నిల్చున్నారు.

వారందర్నీ చూడగానే నాలో కొత్త ఉత్సాహం వచ్చింది.

బండి బయలుదేరింది. వెళ్ళిపోతున్న ఆ కట్టెకు చివరిసారి వీడ్కోలు చెప్పింది ఆమె. భార్గవి గుండెలవిసేలా రోదిస్తూంది.

గ్రామవీధులగుండా బండిమీద శర్మగారి భౌతికకాయాన్ని ఊరేగింపుగా తీసుకెడుతూంటే ఇళ్ళలో నుండి బయటికొచ్చి చూస్తున్నారు గ్రామస్తులు.

ఊరికి ఉత్తరంగా వున్న స్మశానవాటికకు చేరింది

ఊరేగింపు. అక్కడ చితిపేర్చి, ఆ చితిపై శవాన్ని వుంచి, నరసింహం మాస్టారు నదిలో స్నానం చేసివచ్చి, చితిచుట్టు మూడుసార్లు ప్రదక్షిణం చేసి, ఏవేవో మంత్రాలు వల్లిస్తూ చితికి నిప్పంటించారు.

మేమందరం చూస్తుండగానే మంటలు వ్యాపించి, శర్మగారి భౌతికకాయాన్ని ఆవహించసాగాయి. కొన్ని గంటలు వ్యవధిలో అక్కడ బూడిద మిగిలింది.

మేమందరం వెళ్ళి నదిలో స్నానాలు చేసి, మళ్ళీ శర్మగారింటికి చేరుకున్నాము.

"అమ్మా! చనిపోయినవారు తిరిగిరారు. వున్నవాళ్ళం వారితో టిదే లోకమనుకొని వెళ్ళలేము. ఇక్కడ మీకొక శాస్త్ర ధర్మం చెబుతాను. చనిపోయిన వ్యక్తి తాలూకూ ఆత్మను యమధర్మరాజు వద్దకు తీసుకెడతారట. అక్కడ అతను చేసిన పాపపుణ్యాలను బేరీజు వేసి అతను నరకానికి వెళ్ళవలసి వుంటే, "నీ తరఫునఖులో కంలో పుణ్యం చేయగల వారున్నారా?" అని అడుగుతారట. అప్పుడు ఆ జీవి తనకు సంబంధించిన వారు పుణ్యకార్యం నిర్వహించి, ధర్మదేవతను తృప్తిపరుస్తాడు అని అవకాశం అడుగుతాడట. అందుకే చనిపోయిన వారి పేర కర్మక్రతువులు జరిపించి, వారికి సద్గతులు కలిగిస్తారు. పుణ్యకార్యం అంటే ఒకరిని తృప్తి పర్చడం. ఈ మనుష్యుల ఆశకు అంతులేదు. ఏ రూపంలో దానం చేసినా "ఇంకా కావాలి" అంటారేగానీ, 'తృప్తి చెందాము' అనలేరట. అలా అనిపించాలి అంటే, వున్న అవకాశం కొందరికైనా మృష్టాన్న భోజనం పెట్టడం. అలా అన్నం పెట్టి, "తృప్తి చెందారా?" అని అడిగితే, 'తృప్తి చెందాము' అని అంటారట భోక్తలు. అందుకే కర్మంత్రం అంటే పదిమందికి భోజనం పెట్టే ఆచారం వుంది. మా విద్యార్థి సురేష్ ఈ సందర్భంగా వసూలు చేసిన అయిదువందలలో నూటపాతిక కట్టెలకు పోను, మిగిలిన డబ్బు మీకిస్తున్నాను. నేను, మా విద్యార్థులు దగ్గర వుండి ఆ తంతు కూడా జరిపిస్తాము. సవ్యమైన మంత్రంతో నేనే పౌరోహిత్యం వహిస్తాను. మా విద్యార్థులీ విషయంలో గ్రామస్తులకు ఆదర్శప్రాయులయ్యారు. మానవత్వం ఇంకా ఈ భూమి మీద వుందని నిరూపించారు. శర్మగారి ఆత్మకు తప్పక శాంతి చేకూరుతుంది" మా నరసింహం మాస్టారు ఆమెను ఓదార్చారు.

ఆమె మా అందరికేసి కృతజ్ఞతగా చూచింది.

పదవరోజు కర్మక్రతువులు మా నరసింహం మాష్టారుగారి సహకారంతో పూర్తి చేసాము.

గ్రామస్తులంతా ఈ విషయంలో సంతోషించినా, ఆనవాయితీని మార్చినందుకు, తన ఆదాయం పోగొట్టినందుకు శాస్త్రిగారు కుతకుతలాడి పోయారు. తనంతటి ఉద్దండ పండితుణ్ని, ఎదిరించి వీళ్ళు నిర్వహించిన ఈ కార్యక్రమమంతా అపభ్రంశమైనదని, మంత్ర రహితమైన కర్మక్రతువులు నిష్ప్రయోజన మైనదని, తనంతటి నిష్ఠా గరిష్ఠుడి చేతిమీదుగా ఆ కార్యం జరిపించుకొనే అదృష్టం వాళ్ళకు లేకపోయిందని సరిపెట్టుకున్నాడు.

* * *

శాస్త్రిగారు పౌరోహిత్యంమీద బాగా సంపాయించారు. పది ఎకరాల మాగాణీ భూమి వుంది. అతనికి ఒక్కడే కుమారుడు. అతన్ని డాక్టరీ చదివించాడు. ఇక్కడ సంపాయించేది చాలదని అతన్ని విదేశాలకు పంపించాడు. భార్య ఇటీవలే కాలం చేసింది. ఏ చీకూ చింతాలేని జీవిత మాయనది. శుభ కార్యాలకు ముహూర్తాలు నిర్ణయించడం, తన చేతిమీదుగానే జరిపించడం శ్రార్ధ కర్మలు జరిపించడం ఆయన వృత్తి. పౌరోహిత్యం పాడికుండతో సమానమన్నారు మరి.

* * * * * *

ఆ రోజు, నేను నా స్నేహితుడు జాన్ పట్నం వెళ్ళి ఉదయం సినిమా చూచి తిరిగి వస్తున్నాము. రోడ్డు పక్కగా నడుస్తున్న మా మీదకు వెనుకనుండి ఒక స్కూటర్ దూసుకొచ్చింది. దానిముందు చక్రం జాన్‌కేసి గుద్ది కీచ్‌మని శబ్దం చేస్తూ ఆగిపోయింది. జాన్ బోర్ల పడిపోయాడు. నే నదిరిపోయాను. క్షణంలో అక్కడ జనం గుమిగూడారు. స్కూటర్‌వాలాను నాలుగు తిట్టారు. జాన్‌ను లేవదీసి రిక్షాలో ఎక్కించాము. కాలుకు బలమైన గాయమై రక్తం కారుతూంది. స్కూటర్‌వాలా మావెంట హాస్పిటల్ కొచ్చాడు. ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌లో మా వాడికి ట్రీట్‌మెంట్ ఇవ్వను నిరాకరించారు. చేసేదిలేక జాన్‌ను తీసుకొని గవర్నమెంటు ఆసుపత్రికి వెళ్ళాము. నిబంధనల మేరకు పోలీసులకు ఫోన్ చేసి, జాన్‌కు ట్రీట్‌మెంటు మొదలుపెట్టారుడాక్టర్లు.

"బాబు! నేనేం కావాలని మిమీదకు నడపలేదు. ఎదురుగా విసురుగా వస్తున్న సైకిల్‌ను తప్పించబోవడంలో ఇలా జరిగింది. మీ వైద్యానికి అవసరమైన డబ్బు నేనిస్తాను. ఇది నీ పొరపాటేనని చెప్పు. లేకుంటే పోలీసులు మనల నిద్దరిని పీడించుకు తింటారు" అని ప్రాధేయపడ్డాడు స్కూటర్‌వాలా.

నాకు ఇది సబబే అనిపించింది.

ఆ సాయంత్రానికి జాన్‌ను డిస్చార్జి చేసారు. మేమిద్దరం హాస్పిటల్ హాల్ దాటి వస్తుండగా, వార్డుబాయ్‌లు స్ట్రెచర్ మీద ఓ మృతదేహాన్ని తీసుకొస్తూ కనిపించారు. సరిగ్గా మా వద్ద కొచ్చేసరికి ఆ మృతదేహంమీది గుడ్డ గాలికి తొలగిపోయింది. ఆ వ్యక్తి ముఖం కేసి చూచిన మే మిద్దరం అదిరిపడ్డాము. ఆయన మా వూరి శాస్త్రిగారు.

"వీరికేమైంది?" వార్డుబాయ్‌ని అడిగాను.

"రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడితే ఇక్కడ చేర్పించారు. ఆయన వూరు, పేరు తెలియలేదు." జవాబిచ్చాడు వార్డుబాయ్.

"వీరు మా వూరు శాస్త్రిగారు. వీరి నెక్కడికి తీసుకు వెడుతున్నారు?"

"మార్చురీకి పోస్ట్‌మార్టమ్ జరపడానికి వీరి అడ్రస్ కోసం డాక్టర్‌గారు ప్రయత్నిస్తున్నారు. మీరొకసారి డాక్టర్‌గార్ని కలవండి" అని వార్డుబాయ్‌లు శవాన్ని ముందుకు తరలించుకు పోయారు.

నేను జాన్‌ను బెంచీమీద కూర్చుండబెట్టి



డాక్టర్‌గారి వద్దకు పరుగు తీసాము.

"సార్! చనిపోయిన శాస్త్రిగారిదీ మా వూరు."

"అలాగా! ఆయన అడ్రస్ కోసం చాలా ప్రయత్నించాము మేము. వారి సమీప బంధువులకు చెప్పి పంపండి. శవాన్ని అప్పగిస్తాము.

"ఆయన ఒక్కగా నొక్క కొడుకు విదేశాలలో వున్నాడు సార్! నేను వెంటనే వెళ్లి అతనొచ్చే ఏర్పాటు చేస్తాను" అని బయట కొచ్చాను.

జాన్, నేను గ్రామం వస్తూనే గ్రామ పెద్దల కీ విషయం తెలియచేసాము. మావూరి పోస్టుమాష్టర్‌గారి ద్వారా శాస్త్రిగారి కుమారుని అడ్రస్ సంపాయించి, కేబుల్ ఇచ్చాము. గ్రామ పెద్దలంతా, 'ఇంతకంటే మనం చేయగలిగింది లేదు. వారి కుమారుడు వచ్చేవరకు ఎదురుచూద్దాం' అని సరిపెట్టుకున్నారు.

తర్వాత రెండు రోజుల వరకు మాకే వివరము తెలియలేదు. బహుశా ఆయన నేరుగా హాస్పిటల్‌కు వచ్చి, శవాన్ని స్వాధీనపర్చుకుని పట్నంలోనే అంత్యక్రియలు జరిపి వుంటారని అనుకొని సరిపెట్టుకున్నాం. కానీ నాలుగు రోజుల తర్వాత హడావుడిగా టాక్సీలో వచ్చారు శాస్త్రిగారి కొడుకు.

"మా నాన్న కేమైంది?" అడిగాడు నన్ను.

"రోడ్డు ప్రమాదంలో మరణించారు. మీరింకా హాస్పిటల్‌కు వెళ్ళలేదా?" ఆశ్చర్యంగా అడిగాను నేను.

"ఏం చెయ్యను. అక్కడ పనులు చక్కబెట్టుకొని రావడం కాస్త ఆలస్యమైంది. బాబూ! నీవు కూడా నాతో రా హాస్పిటల్‌కు వెళ్ళి విచారిద్దాం" అడిగాడాయన.

నేను ఆయన వెంట కారెక్కి పట్నం బయలుదేరాను.

మేము హాస్పిటల్‌కు వెళ్లి డాక్టర్‌గార్ని కలిసాము.

"సారీ బ్రదర్! మా రూల్స్ ప్రకారం శవాన్ని డెబ్భై రెండు గంటలకంటే ఎక్కువ కాలం నిల్వ వుంచలేము. మీ రెవరూ రాలేదు గనుక, "అనాధ శవం"గా మున్సిపాలిటీకి అప్పగించాము. వారే తీసుకెళ్ళి ఖననం చేశారు" డాక్టర్‌గారు చెప్పారు.

ఒక్క దీర్ఘ నిట్టూర్పు విడిచి బయటి కొచ్చాడు శాస్త్రిగారి కొడుకు.

'మిస్టర్ సురేష్– ఇంత బ్రతుకు బ్రతికి అనాధప్రేతంగా మట్టిలో కలిసి పోయాడు మా నాన్న. ఓ. కే. ఏదీ మన చేతులలో లేదు. నా కొక్క సాయం చేసిపెట్టు." అడిగాడాయన.

"చెప్పండి సార్!" అన్నాను.

"నేను అమెరికాలో అర్థాంతరంగా చాలా పనులొదిలిపెట్టి వచ్చాను. నీ వద్ద ఓ అయిదు వేలిస్తాను. కూలి మనుష్యులను పెట్టి మా నాన్నగారి కర్మక్రతువులను జరిపించు. పోయిన వాళ్ళెలాగు పోయారు. అనవసరంగా రోజుకు ఇరవై వేలు ఆదాయం పోగొట్టుకొని, ఇక్కడ అర్థం లేని ఈ కార్యక్రమం నిర్వహించడ మెందుకు?" అన్నాడాయన.

"అదికాదు సార్! ఆయన కొడుకుగా ఆయనకు కర్మక్రతువులు నెరిపి, ఆయనకు సద్గతులు కలిగించడం మీ ధర్మం" నాకు తోచిన సలహా ఇచ్చాను.

"ఫర్వాలేదు. పౌరోహితుడుగా ఆయన ఎన్నో పుణ్యకార్యాలు చేసాడు. ఆయన కసలు వేరే కర్మక్రతువు లక్కరలేదు. ఆయన తప్పకుండా పుణ్యలోకాల కెళ్ళ గలడు." అని బ్రీఫ్‌కేస్ తెరిచి, నోట్ల కట్టలు నా కందించాడు.

నేను టాక్సీ దిగాను. నేను పరిస్థితి అర్థం చేసుకొనేంతలో నే ఆయన విలాసంగా నాకేసి చేయి వూపుతున్నాడు, ముందుకు వెడుతున్న టాక్సీ కిటికీ నుండి.

"శాస్త్రిగారి ఆత్మకు శాంతిని చేకూర్చు భగవాన్!" అని మనసులోనే దేవుడిని ప్రార్థించి, మా వూరి బస్టాండు వైపు నడక సాగించాను.

●

నూతన యవ్వనం పొందండి! సంతానవంతులుకండి
చర్మవ్యాధులు నుండి విముక్తులుకండి!

హస్త ప్రయోగము వలన కలిగిన నరముల బలహీనత, అంగము చిన్నదగుట, అవసర కాలమందు అసంతృప్తి దాంపత్య సుఖం లేక పోవుట, సంతానము లేకపోవుట, ఉబ్బసం, సొరియాసిస్ పొడలు, కురద, తెలుపు (బొల్లి), నలుపు, ఎరుపు మచ్చలు, రసిపుండ్లు, సుఖసంబంధమైనవ్యాధులు, స్ఫులా, మూలశంకలు, స్త్రీలకుసుమ వ్యాధులు, బ్లడ్‌ప్రషర్, పక్షవాతము, మేహపొడలు, సమస్త దీర్ఘ వ్యాధులకు, చర్మవ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడ చికిత్స కలదు.

ప్రతినెల క్యాంపులు :–

ప్రతినెల క్యాంపులు:

రాజమండ్రి: 1,16 తేదీలలో "అశోకాలాడ్జి", కోటగుమ్మంవద్ద.
కాకినాడ : 2,17 తేదీలలో "వీనస్ A.C. లాడ్జి", కల్పనాటాకీస్‌ఎదుట
భీమవరం: 3,18 తేదీలలో "షణ్ముఖ లాడ్జి"
ఒంగోలు: 9 వ తేదీ "హోటల్ పూర్ణిమ" A.C., బస్టాండ్ దగ్గర.
ఖమ్మం : 25 వ తేదీ "హోటల్ కిన్నెర" A.C., బస్‌స్టాండ్ దగ్గర.

Note: ప్రతికేంద్రంలో ఉ॥ 10-00 గం॥ నుండి రాత్రి 10-00 గం॥ వరకు. పై తేదీలు మినహా మిగిలిన దినములలో డాక్టరుగారు గుడివాడలోని క్లినిక్‌లో వుంటారు.

SHAH.

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేదభిషక్, సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్
పార్కురోడ్, గుడివాడ-521 301 * ఫోన్స్: 2522 & 2540.

రచయితలకి సూచనలు

ఆంధ్ర సచిత్రవారపత్రికకి పరిశీలనార్థం తమ రచనలని పంపే వారు ఈ కింది సూచనలని గమనించ కోరుతున్నాము.

రచనలు కాగితానికి ఒక వైపే సిరాతో లేదా బాల్‌పెన్‌తో రాయాలి. కాగితానికి రెండు వైపులా రాసి ఉన్న రచనలని పరిశీలించటం జరగదు.

పరిశీలనకి పంపే రచనలు కథలైతే 10 అరఠావు పేజీలకి మించకుండా ఉంటే మంచిది. వ్యాసాలు 3 అరఠావు పేజీలు మించరాదు. వ్యాసాలు పంపేవారు వాటికి సంబంధించిన బొమ్మలు లేదా ఫొటోలు జతపరిచి పంపటం అవసరం.

రచనలు స్వంత రచనలై ఉండాలి. అనువాదాలు, అనుసరణలు, కాపీ రచనలు పంపరాదు. ఆ మేరకి రచయిత(త్రి) హామీ పత్రం రాసి సంతకం చేసి రచనతో పాటే పంపాలి.

రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే రాసి ఉండాలి. వ్రాత ప్రతి మీద రచయిత(త్రి) పూర్తి చిరునామా స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయాలి.

కథల పరిశీలనకి 1–2 నెలలు, నవలల పరిశీలనకి కనీసం 6 నెలలు పట్టవచ్చును. పరిశీలన అయిన తర్వాత ఏ విషయం ఆయా రచయిత(త్రు)లకి తెలియచేయటం జరుగుతుంది. ప్రచురణకి స్వీకరించని రచనలని తిప్పి పంపకోరేవారు తమ రచనతో పాటే స్వంత చిరునామా కల, తగినన్ని తపాలా బిళ్లలు అతికించిన కవరు జత పరచి పంపాలి. లేకపోతే వాటిని తిప్పి పంపటం సాధ్యం కాదు. రచనలు తిప్పి పంపే విషయంలో తగిన జాగ్రత్త తీసుకోటం జరుగుతుంది కానీ పోస్టులో పోయే వాటి విషయంలో మేము బాధ్యతని స్వీకరించలేము. వాటిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకీ అవకాశం లేదు.

రచనలు పంపిన వారు తమ చిరునామా మారిన సందర్భంలో వెంటనే ఆ విషయాన్ని మా కార్యాలయానికి తెలియ చేస్తూ ఒక కార్డు రాయటం అవసరం.

ఉత్తరాలు, తదితర పాఠకుల శీర్షికలకి రాసే వారు కూడా తమ పేరు, పూర్తి చిరునామా ఇవ్వాలి. రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే ఉండాలి. లేకపోతే వాటిని పరిశీలించటం జరగదు.

పరిశీలనకి పంపే రచనలని "సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520003" అనే చిరునామాకి పంపాలి. కవరు పైభాగంలో శీర్షిక పేరు రాయటం మంచిది.

– సంపాదకుడు